# హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక

## మొదటి పాఠము

## హెబ్రీయులకు వ్రాయబడిన పత్రికకు ఉపోద్ఘాతము

*"సహోదరులారా మీకు సంక్షేపముగా వ్రాసి యున్నాను గనుక ఈ హెచ్చరిక మాటను సహించుడని మిమ్మును వేడుకొనుచున్నాను."* *హెబ్రీ 13:22*

రచయిత, వారి యొద్దకు వెళ్ళక మునుపే ఈ పత్రికను వ్రాసెను. కాబట్టి గ్రహీతలు ఒక ప్రత్యేకమైన ప్రాంతములో నివసించువారని మనము భావించవచ్చును. తిమోతికి విడుదల కలిగినది. బహుశా చెరసాల నుండి కావచ్చు. తిమోతి శీఘ్రముగా తన యొద్దకు వస్తే, అతనితో కలిసి ఇటలీ నుండి వారి యొద్దకు వచ్చెదనని రచయిత చెప్పెను. హెబ్రీ 13:23. "నేను మరి త్వరగా మీ యొద్దకు మరల వచ్చునట్లు ఈలాగు చేయవలెనని మరియెక్కువగా బతిమాలుకొనుచున్నాను." (హెబ్రీ 13:19) అని చెప్పుట ద్వారా, గ్రహీతలతో రచయిత కొంతకాలము గడిపి ఉండవచ్చును. "అట్టి రక్షణ ప్రభువు బోధించుట చేత ఆరంభమై.... **వినిన వారిచేత** మనకు **దృఢపరచ బడెను**" (హెబ్రీ 2:3,4) అని రచయిత చెప్పిన దానిని బట్టి, ఇతడు అపొస్తలుడు కాడు. లేక ప్రత్యక్షముగా యేసు చేత బోధింపబడిన వాడు కాకపోవచ్చును. దైవికముగా కాక సాంప్రదాయంగా "హెబ్రీయులకు" అని పిలువబడిన పత్రిక రచయితను గూర్చి మనము తెలిసికొనగలిగినదంతా ఇదే.

ఈ పత్రిక, గ్రహీతల యొక్క అసలైన జాతీయతను సూచించినట్లయితే, ఈ పత్రికంతటిలో ఉదహరించబడిన పాతనిబంధన సంగతులు, ఆ పేరుతో మనము ఏకీభవించునట్లు చేస్తున్నాయి. రచయిత పత్రికయని పిలిచిన లేఖనాంశములను పొందిన ప్రజలు, యూదా నేపధ్యము నుండి వచ్చిన క్రైస్తవులై ఉండవచ్చును. అయి నను రచయిత గ్రీకు భాషలో వారికి వ్రాసిన దానిని బట్టి, వారు యూదయకు బయట నివసించినవారై ఉండవచ్చును.

ఇంతవరకు చెప్పబడిన సంగతులు, ఇక ముందు ఈ పత్రికను వ్యాఖ్యానించుటలో కొంతవరకు మాత్రమే ఉపయోగపడును. గ్రహీతలకు రచయితకు మధ్య గల అనుబంధమునకు సంబంధించిన సమాచారము, ఈ పత్రికలోఉదహరించబడ లేదు గనుక, ఈ పత్రికను సరిగా చదివి, వ్యాఖ్యానించుటకు వారి మధ్యగల సంబంధము గూర్చి తెలుసుకొనవలసిన అవసరము లేదు. రచయిత పేరు, తెలుపబడ లేదు గనుక వారి మధ్యగల సంబంధ బాంధవ్యాలు మనకు తెలియదు. కొరింథీయులకు వ్రాయబడిన పత్రికలు మరియు ఇతర పత్రికలను గ్రహించుటకు, రచయిత మరియు గ్రహీతలకు మధ్యగల సంబంధమును తెలుసుకొనుట చాలా ముఖ్యముగాని అవి హెబ్రీ పత్రికకు అవసరం లేదు.

బైబిలు విద్యార్థులందరు, అవసరమును బట్టి వ్యాఖ్యానకర్తలుగా వ్యవహరించు దురని దయచేసి గమనించుము. మనము లేఖనములను సరిగా వ్యాఖ్యానిస్తున్నామా లేక తప్పుగా వ్యాఖ్యానిస్తున్నామా అనేదే ప్రశ్న? పాఠ్యాంశము యొక్క 'స్పష్టమైన అర్థము'ను పొందుటయే మంచి వ్యాఖ్యానము యొక్క లక్ష్యము. వెలిగింపబడిన వివేకము అనేది చాలా ముఖ్యమైన అంశం, పాఠకుని మరియు లేఖనము యొక్క స్వభావమును బట్టి 'వ్యాఖ్యానము' ప్రభావితము చేయబడునని మనము తెలుసుకొన వలెను.*

మన సంస్కృతి, భాష కాకుండా, వేరే సంస్కృతి, వేరే భాష కలిగిన వారికి హెబ్రీ పత్రిక వ్రాయబడెను, గనుక దాని స్వభావము వేరేగా ఉండునని గ్రహించాలి. మనము గ్రీకు భాషలో పండితులము కానట్లయితే, మంచి తర్జుమా మీద ఆధారపడాలి. పాఠకులుగా పత్రికను చదువునపుడు మరియు వ్యాఖ్యానించునపుడు, ఆ లేఖనము యొక్క స్వభావమును బట్టి కాకుండా, అంతకు ముందు మనము ఆ లేఖనమును అర్థము చేసుకొనిన దానిని బట్టి మరియు మన సంస్కృతిని బట్టే దానిని వ్యాఖ్యానించు టకు ప్రయత్నించుదము. ఈ కారణమును బట్టి మన అధ్యయనము, కొన్ని బైబిలు వ్యాఖ్యాన సూత్రములను జాగ్రత్తగా అన్వయించుట ద్వారా అదుపు చేయబడవలెను. వాటిలో క్రింది సూత్రములు కనిష్టమైనవి.

1. సూత్రము: చారిత్రాత్మక విశ్లేషణ. హెబ్రీయులకు వ్రాయబడిన పత్రికను ఉత్తరమువలె చదువుము. ఎలాగంటే? ప్రారంభము నుండి ముగింపు వరకు పత్రికను ఒకసారి కంటే ఎక్కువసార్లు చదువుము. రచయిత ఈ పత్రికను వ్రాసినప్పుడు వారి పరిస్థితిని ఎలాగు చూచుచున్నాడో అలాగే మనమును చూచుటకు ప్రయత్నించుదము. పాఠ్యభాగమును గూర్చి మనము అడుగ వలసిన ప్రశ్నలు.

గ్రహీతలు ఏదైన సమస్యను కలిగి యున్నారా? కలిగి యుంటే, వారి ముఖ్య సమస్య ఏమిటి? ఆ సమస్య, బోధకు సంబంధించినదా? లేక ఆత్మీయ పెరుగుదలకు సంబంధించినదా? సహజముగా, ఒకరకమైన సమస్య ఇంకొక సమస్యకు దారితీయును. కాబట్టి రచయిత ఏ సమస్యను పరిష్కరించుటకు ప్రయత్నము చేయుచున్నాడో, అదే ముఖ్యమైన సమస్యయని భావించవలెను. ఒకవేళ, అది బోధన పరమైనదైతే, దాని మూలమేమిటి? ఆ సమస్య బయట నుండి వచ్చినదా లేక సంఘములోనిదా? చివరకు వారి సమస్య(లు) ఎంత తీవ్రమైనది? ఈ ప్రశ్నలకు జవాబులను ఈ పత్రికలోనే మనము వెదకి గమనించునట్లు కృషి చేయవలెను.

మన ఊహకు ఒక రూపము ఇచ్చువరకు ఇతర వ్యాఖ్యాన గ్రంథముల వైపు మనము 'తిరుగరాదు.' వ్యాఖ్యానములు, సమస్య యొక్క వైశాల్యమును చూచుటకు సహాయపడునేమో గాని, పరిష్కారము లేఖనముల నుండి మాత్రమే రావలయును. కాబట్టి, రచయిత ఏ దృష్టితో గ్రహీతలను చూచుచున్నాడో, అదే దృష్టితో మనము వారిని చూడవలెను. పత్రికలోని సమస్యలకు

సందర్భానుసారమైన "పరిష్కారము" నిమిత్తమై, క్రొత్త నిబంధనలోని ఇతర పుస్తకములతో పాటు క్రైస్తవ వేదాంతం, నీతి సూత్రములు మరియు అభ్యాసమును మనము అర్థము చేసి కొనవలెను. క్రైస్తవ సమాజములో మనకు విభజనలు కలవు. తప్పుడు వ్యాఖ్యానమే కొంత వరకు ఈ విభజనకు మూలము.

2 సూత్రము: సాహిత్యపరమైన విశ్లేషణ. గ్రహీతల పరిస్థితిని గూర్చి రచయిత ఏమిచెప్పెను? వారు సమస్యను కలిగియున్నయెడల, సమస్యను పరిష్కరిం చుటకు అతడు వారికి ఏ సహాయము చేయజూచెను? అతడు వినియోగించిన సాధనములు మరియు పద్ధతి ఏమిటి? సమస్యను మనము 'ఖచ్చితముగా' అర్థము చేసికొనినప్పుడే, రచయిత వెల్లడి చేసిన దైవిక పరిష్కారమును కూడ మనము సరిగానే అర్థము చేసికొనగలము. వారొక ప్రత్యేకమైన సమస్యను కలిగి ఉన్నారని మనము నిర్ధారించినప్పుడు, రచయిత వేరొక సమస్యకు పరిష్కారమిచ్చినట్లయితే, మనము ఊహించిన దానిని తిరిగి పరిశీలించ వలెను. గ్రహీతలు కలిగియున్న సమస్యను పరిష్కారించుటలో దైవిక ప్రేరణ కలిగిన రచయిత ఎల్లప్పుడు కృషి చేస్తూనే ఉంటాడు. దేవుని కృప వలన వాక్యములో సమస్యలు మరియు పరిష్కారములు వ్రాయబడుటను బట్టి, మన వ్యక్తిగత క్రైస్తవ జీవితం యొక్క అభివృద్ధికి వాటిని మనము అన్వయించ గలము.

ఈ పత్రికను పొందిన క్రైస్తవులు హెబ్రీ సంస్కృతిలో పెంచబడియుంటే, "సంక్షేపముగా వ్రాసిన ఈ పత్రిక" ద్వారా వారిని హెచ్చరించుటయే రచయిత యొక్క ముఖ్య ఉద్దేశ్యమైయున్నది. "కాబట్టి మీ **ధైర్యమును** విడిచిపెట్టకుడి దానికి ప్రతిఫలముగా గొప్ప బహుమానము కలుగును. మీరు దేవుని చిత్తము నెరవేర్చిన వారై వాగ్దానము పొందు నిమిత్తము మీకు **ఓరిమి** అవసరమై యున్నది" అని హెబ్రీ 10:35, 36లో రచయిత హెచ్చరించుచూ వ్రాయుచున్నాడు. వారికి దేవుని చిత్తము తెలియదని లేక అర్థము కాలేదని కాదుగాని, దేవుని బహుమానము కొరకు ఎదురు చూస్తూ ఆయన చిత్తము నెరవేర్చుటకు వారికి ఎక్కువ ధైర్యము మరియు **ఓరిమి** అవసరమైయున్నది. బోధనపరమైన సమస్య కలిగి గ్రహీతలు యూదా మతము వైపు తిరిగిరని, ఈ పత్రికపై వ్రాయబడిన కొన్ని వ్యాఖ్యానములు చెప్పినను, హెబ్రీ గ్రంథకర్త దానికి భిన్నమైన సమస్యను చూచెను. హెబ్రీ పత్రిక ఆత్మ సంబంధమైన అనేక సమస్యలను బయలు పరిచెను. కావున, గ్రంథము వారికిని, మనకును సమస్యల పరిష్కారము కొరకు పనిచేయుచున్నది. హెబ్రీ పత్రిక **నిరంతర సంబంధము కలిగినది,** అనగా అన్ని కాలములలో నున్న క్రైస్తవుల ఆత్మీయ ఎదుగుదలకు సంబంధించి, అటువంటి సమస్యలను పరిష్కారించుటకు ఉపయోగపడునది.

3 సూత్రము: గ్రహీతలకు తెలిసిన వాటిలో పాఠకుడు కొంతైన తెలిసికొని ఉండవలెను. హెబ్రీ పత్రికను చదువుటకును, అర్థము చేసికొనుటకును, పాత నిబంధన కథలలో దేవుడు ఏమి చేసెను అను సంగతులను మనము బాగా ఎరిగి యుండవలసిన అవసరమున్నది. ఉదా: మనకు మోషేను గూర్చి తెలియకపోతే, హెబ్రీ 3వ అధ్యాయములో చెప్పబడిన సంగతులను మనము సరియైన విధముగా చదివి అర్థము చేసికొనలేము. దేవదూతలను గూర్చి మనకు గ్రహింపు లేకపోతే, ఈ పత్రికలో అనేక విషయములను మనము అర్థము చేసుకొనలేము. హెబ్రీ 1:4-2:16; 12:22,23; 13:1.

4 సూత్రము: రచయిత యొక్క శైలిని అర్థము చేసుకొనుట. హెబ్రీ పత్రికలో రచయిత యొక్క శైలి లేక అతని ఆలోచన సరళి ఈలాగున్నది.

గ్రహీతల సంస్కృతిలో, వారు బాగా ఎరిగిన అంశములను రచయిత మొదట తెలియ పరచును. ఎందుకనగా హెబ్రీ క్రైస్తవులు పాత నిబంధన లేఖనములపై ఆధారపడిన యూదా సంస్కృతిలో పెరిగిన పూర్వ చరిత్ర గలవారు గనుక, మొదటి అధ్యాయములో దేవదూతలను గూర్చి, మూడవ అధ్యాయములో మోషేను గూర్చి, నాలుగవ అధ్యాయములో దేవుడు తన ప్రజలకు వాగ్దానము చేసిన విశ్రాంతిని గూర్చి, ఐదవ అధ్యాయములో దేవుని చేత పిలువబడిన యాజకులను గూర్చి, ఏడవ అధ్యాయము నుండి లేవి యాజకత్వమును గూర్చి రచయిత చెప్పిన వాటిని వారు బాగా ఎరుగుదురు.

రెండవదిగా, యేసుక్రీస్తును గూర్చి వారికి ఏమి బోధింపబడెనో, రచయిత దానిని తిరిగి వారికి జ్ఞాపకము చేయుచున్నాడు. పాత నిబంధనకు సంబంధించిన అంశము లను వివరిస్తూ రచయిత, యేసు యొక్క రాజరికము మరియు యాజకత్వము, దేవ దూతల పాత్ర కంటెను మోషే పాత్ర కంటెను, మరెంతో శ్రేష్ఠమైనదని వారికి చూపెను. వారు ఒకసారి వెలిగింపబడిరి (హెబ్రీ 2:3,4; 4:2; 10:32) అయినప్పటికిని, ఈ పత్రిక వ్రాయు సమయమునకు, "క్రీస్తునందు" దేవుడు వారికి చేసినది, మరియు చేయుచున్న దానిని వారు మరచినట్టున్నారు. శ్రమలతో కూడిన శిక్షణ ద్వారా ఆత్మీయ ఎదుగుదల కొరకైన దేవుని కార్యక్రమము పట్ల, వారు తమ విశ్వాసమును కోల్పోవుచున్నట్టున్నారు. "దేవుని కుమారుల"మను తమ వ్యక్తిగత గుర్తింపును కూడ వారు కోల్పోవు ప్రమాదమును కలిగి ఉన్నారు (హెబ్రీ 12:4-13).

మూడవదిగా, పాతనిబంధనలో గల అంశములను రచయిత వారికి తెలియ పరచిన తరువాత, యేసును గూర్చి వారికి బోధింపబడిన విషయములను జ్ఞాపకము చేస్తూ, రచయిత వారిని కఠినముగా హెచ్చరించెను. హెబ్రీ పత్రికలో 1 నుండి 12 అధ్యాయములలో ఈ క్రింద కనపరచిన రీతిగా రచయిత మూడు మెట్ల పద్ధతిని ఉపయోగించెను. ఉదాహరణ:

**మొదటి మెట్టు.** వారికి దేవదూతలను గూర్చి తెలుసు1:4; దేవదూతల ద్వారా పలుక బడిన సందేశము స్థిరపరచబడినదని వారు నమ్మిరి 2:2.

**రెండవ మెట్టు.** యేసు దేవదూతల కంటె ఎంత శ్రేష్ఠుడో రచయిత మొదటి అధ్యాయ ములో క్రోడీకరించిన లేఖనముల ద్వారా వారు ఒకప్పుడు వెలిగింప బడి యున్నారు.

**మూడవ మెట్టు.** ఇది రచయిత హెచ్చరిక రూపంలో ఇస్తున్న ప్రోత్సాహం దేవదూతల ద్వారా పలుకబడిన దేవుని మాటలను మీరు నమ్మిరి, యేసు దేవదూతల కంటే ఎంతో శ్రేష్ఠుడు, కాబట్టి మీరు ఆయన మాటలు పాటించే విషయములో ఇంకా ఎక్కువ జాగ్రత్త కలిగి యుండుట అవసరం కదా! దీని గూర్చి ఆలోచించుడి అని చెప్పెను. హెబ్రీ 2:1-4 చూడుము.

వారి మరియు క్రైస్తవులందరి ఆత్మీయ పెరుగుదలకు సంబంధించిన సమస్య, "లోపలి నుండి బయటకు" అనే పద్ధతి ద్వారా, పరిష్కరించబడాలి. సహాయము చేయుటకు యేసు సిద్ధముగా ఉన్నాడు కాని, దేవుడు మానవ జాతికి, ఎన్నుకొనే స్వాతంత్ర్యమును అనుగ్రహించెను. మూడు మెట్ల పద్ధతిని రచయిత ఉపయోగించుట ద్వారా, గ్రహీతలు తమంతట తామే, తమ పరిస్థితిని అంచనా వేయవలెనని కోరెను. వారు ఘోరమైన ఆత్మీయ అపాయములో ఉన్నారు. "వారు వెలిగింపబడిన మీదట శ్రమలతో కూడిన గొప్ప పోరాటమును సహించిన పూర్వపు దినముల" (హెబ్రీ 10:32) నుండి వారు ఎంత దూరము తొలగిపోయారో, అర్థము చేసికొనవలసిన అవసరమున్నది వాస్తవానికి రచయిత, వారు కేవలము ఆత్మీయ ఎదుగుదలకు సంబంధించిన సమస్య మాత్రమే కలిగియున్నారని చెప్పుట చాలదని నమ్ముచున్నాడు. వారు ఆదివారము ఉదయమున విను ప్రసంగము కంటె, వాక్యము విను విషయములో ఇంకా ఎక్కువ సమయము కేటాయించవలసిన అవసరం వారికున్నది. వారు తమ్మును తాము పరీక్షించుకొనవలసిన అవసరము ఉన్నది (2 కొరింథీ 13:5). ఈ మూడు మెట్ల శైలిని ఉపయోగించుట ద్వారా రచయిత వారికి సహాయము చేయ ప్రయత్నించెను.

మన తరువాతి పాఠములో మన హెబ్రీ పత్రిక అధ్యయనమునందు ఎక్సెజిటికల్ (వ్యాఖ్యాన) పద్ధతిని అనుసరించుదము. హెబ్రీ పత్రిక మాట్లాడు పరిస్థితిని అర్థము చేసుకొనుటకు, పైన తెలిపిన నాలుగు బైబిలు వ్యాఖ్యాన సూత్రములను ఉపయో గించుటే ఎక్సెజిటికల్ అప్రోచ్ యొక్క అర్థము. రెండు నుండి ఎనిమిదవ పాఠము వరకు ఈ పనిచేయుదుము.

"అప్పుడు-అక్కడ" జరిగిన పరిస్థితిని అర్థము చేసికొనుటయే 'ఎక్సజీసెస్' యొక్క లక్ష్యము. హెబ్రీ క్రైస్తవుల సమస్యలకు రచయిత ఇచ్చిన దైవిక పరిష్కారము గూర్చి అర్థము చేసికొనుటయే మన ముఖ్య ఉద్దేశ్యము. 'ఎక్సజీసెస్' యొక్క క్రమశిక్షణ చారిత్రక మరియు సాహిత్యపరమైన విశ్లేషణతో సంబంధము కలిగి ఉన్నది.

లేఖనములు అప్పుడు-ఏ అర్థము ఇచ్చెనో దానిని కొంతవరకు గ్రహించిన తరువాత, ఇప్పుడు ఆ లేఖనములు ఏమి అర్థము ఇచ్చుచున్నవో గ్రహించుటకు మనము వ్యక్తిగత పఠనము చేయగలము. "ఇప్పుడు-ఇక్కడ" మనకు ఆ లేఖనములు ఏ అర్థమిచ్చుచున్నావో ఆలోచించుటకు ప్రయత్నించుదము. హెర్మెన్యూటిక్స్ యొక్క క్రమశిక్షణ, "ఇప్పుడు-ఇక్కడ" అనగా లేఖన అధ్యయన భాగములో దాని అర్థముతో సంబంధము కలిగియున్నది. హెబ్రీ పత్రికలో దేవుడు బయలుపరచిన జీవ నియ మములను మరియు కృపలను మనము అర్థము చేసికొనుటకు ప్రయత్నించుదము.

**దయచేసి గమనించుము: అప్పుడు ఇవ్వని అర్థము లేఖనము ఇప్పుడును ఇవ్వదు.***

ఒక లేఖనము యొక్క అర్థము "ఇది" అని మనము నిర్ణయించినపుడు, సందర్భా నుసారముగా ఆ లేఖనము అప్పుడు ఏమి అర్థమిచ్చెనో అను దాని ద్వారా, అది తప్ప కుండా అదుపు చేయబడవలెను.

సాంకేతిక భాషలో చెప్పాలంటే: మన హెర్మెన్యుటిక్స్ మంచి ఎక్సజీసెస్ ద్వారా అదుపు చేయబడవలెను.

హెబ్రీ పత్రికపై ఈ పాఠముల శీర్షికల యొక్క ఉద్దేశ్యము ఎక్సజిటికల్ విధాన ముచే (అప్పుడు-అక్కడ) అదుపుచేయబడినను, మూలపాఠ్యభాగము యొక్కఅర్థమును గ్రహించుటకు, సలహా ఇవ్వదగిన కొన్ని ఇతర వ్యాఖ్యానములను కూడ మనము చూడవచ్చును. ఎక్సజిటికల్ ఊహలను వివరిం చుటకు ఈ పాఠములు తయారు చేయబడి సమర్పించబడినవి. ఇది హెబ్రీ పత్రిక యొక్క వ్యాఖ్యానము కాదు. హెబ్రీ పత్రిక యొక్క అర్థమును సొంతముగా వ్యాఖ్యానిం చుటకు పాఠకులు శక్తిగలవారగునట్లు (చదువుటకు తోడ్పడునట్లుగా) ఈ పాఠములు ఉ పయోగపడును.

* Fee మరియు Douglas Stuart చే రచించబడిన How to Read the Bible for All Its Worth. నుండి గ్రహించబడినది.